క్లుప్తంగా

మహిళలకు ముగ్గుల పోటీలు



విజేతలకు బహుమతుల ప్రదానం

కోవెలకుంట్ల: క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని ఆదివారం పట్టణంలోని ఎల్ఎం కాంపౌండ్‌లో సీపీఎం ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. 30 మహిళలు పాల్గొనగా కాలనీకి చెందిన లీలావతి మొదటి బహుమతి, మణి ద్వితీయ, ప్రమీల తృతీయ, వసంత, భార్గవి ఆ తర్వాతి బహుమతులు కైవసం చేసుకున్నారు. విజేతలకు సీపీఎం నేత సుధాకర్ బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో న్యాయవాది ఆంజనేయులు, వెంకటసుబ్బారెడ్డి, సీపీఎం నాయకులు త్యాగరాజు, రాములమ్మ, నరసింహులు, ఓబులేసు, సుబ్బయ్య పాల్గొన్నారు.

వృద్ధులకు చీరలు పంపిణీ



ఆటోనగర్‌లో చీరలు పంపిణీ చేస్తున్న దృశ్యం

డోన్: ముందస్తు క్రిస్మస్ సందర్భంగా స్థానిక ఆటో నగర్‌లోని నిరుపేద వృద్ధ మహిళలకు కర్నూలుకు చెందిన ఇమ్మానుయేలు చేతన్, ప్రేమదాసు ఆర్థికసాయంతో ఆదివారం చీరలు పంపిణీ చేశారు. ప్రార్థనా సమయం స్వచ్ఛంద సంస్థ నిర్వాహకుడు జాన్ ప్రభాకర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం



మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న వెంకటసుబ్బారెడ్డి

కొలిమిగుండ్ల: బెలుంకు చెందిన డ్రైవర్ మారెం తిరుపతయ్య(45) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న పోతిరెడ్డి రామసుబ్బారెడ్డి సేవా ట్రస్ట్ అధ్యక్షుడు వెంకటసుబ్బారెడ్డి గ్రామానికి చేరుకుని మృతదేహం వద్ద నివాళులర్పించారు. అంత్యక్రియల నిమిత్తం కుటుంబ సభ్యులకు ట్రస్ట్ తరఫున రూ.25 వేల ఆర్థిక సాయాన్ని అందించారు.

విశ్రాంత ఉద్యోగులకు జ్ఞాపికలు పంపిణీ



జ్ఞాపికలు అందజేస్తున్న సంఘం సభ్యులు

డోన్: పెన్షనర్స్ డే విజయవంతం చేయడానికి సంఘ సభ్యులైన రిటైర్డు ప్రభుత్వ ఉద్యోగులందరూ సంపూర్ణంగా సహకరించారని ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి భానుసింగ్, డోన్ యూనిట్ గౌరవాధ్యక్షుడు సుబ్బరాయుడు అన్నారు. స్థానిక పెన్షనర్స్ కార్యాలయంలో ఆదివారం సంఘం సభ్యులైన ప్రతి ఒక్కరికీ జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో సంఘం కార్యదర్శి గాలయ్య, కోశాధికారి గోపాల్, ఉపాధ్యక్షుడు దాసప్ప, సభ్యులు మౌలాలి, ఈరన్న, గొల్ల రాముడు తదితరులు పాల్గొన్నారు.

విజయవాడకు భవానీ భక్తుల పయనం



దుర్గా మల్లేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

బేతంచెర్ల: మండల కేంద్రమైన బేతంచెర్ల పట్టణంతో పాటు ఆర్ఎస్ రంగాపురం, సిమెంట్ నగర్ గ్రామాల్లో భవానీమాల స్వీకరించిన భక్తులు మండల దీక్ష అనంతరం ఇరుముడులను సమర్పించేందుకు ఆదివారం విజయవాడకు బయలుదేరి వెళ్లారు. నంద్యాల రహదారిలోని దుర్గా మల్లేశ్వరస్వామి, దుర్గాపేట మహిషాసురమర్దిని, సిద్ధప్ప దేవాలయాల్లో గురుస్వాములు సూరిబాబు, టైలర్ రాముడు, శ్రీనివాసులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజల అనంతరం ఇరుముడితో విజయవాడకు బయలుదేరారు.

లారీ క్లీనర్‌పై దాడి

కొలిమిగుండ్ల: ట్రాక్టర్లు, లారీల్లో నాపరాళ్ల రవాణ జరగకుండా చెక్‌పోస్టు వద్ద యజమానులు అడ్డుకుంటున్నారు. ఈ క్రమంలోనే శనివారం రాత్రి అవుకు మండలం రామాపురం నుంచి పాలీష్ లోడ్‌తో లారీ వెళ్లగా చెక్‌పోస్టు వద్ద అడ్డుకున్నారు. మాటామాట పెరిగి లారీ క్లీనర్‌పై దాడి చేసినట్లు సమాచారం. ఈవిషయంపై అవుకు మండలానికి చెందిన టీడీపీ సీనియర్ నేత సీరియస్‌గా తీసుకున్నట్లు తెలుస్తోంది. సంబంధిత లారీని అడ్డుకోవడంతో అక్కడే నిలిపివేశారు. దాడిపై పోలీసులకు ఫిర్యాదు చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి.







కోవెలకుంట్ల-గుంజలపాడు రహదారిలో కురుస్తున్న పొగమంచు, నంద్యాల-ఎర్రగుంట్ల రైల్వేమార్గంలో మంచును చీల్చుకుంటూ వెళ్తున్న రైలు, పంట పొలాలపై మంచు దుప్పటి

మంచు అందాలు

కోవెలకుంట్ల పట్టణాన్ని పొగమంచు కప్పేసింది. ఆదివారం తెల్లవారుజామున 5.30 గంటలకు ప్రారంభమైన పొగమంచు దాదాపు రెండు గంటలపాటు కురిసింది. కోవెలకుంట్ల నుంచి జమ్మలమడుగు, నంద్యాల, ఆళ్లగడ్డ, బనగానపల్లె, తాడిపత్రికి వెళ్లే ఆర్అండ్‌బీ రహదారులను పొగమంచు కప్పేయడంతో వాహన చోదకులు లైట్లు వేసుకుని రాకపోకలు సాగించాల్సి వచ్చింది. పంట పొలాలపై దుప్పటి కప్పినట్లు మంచు కురిసింది. మంచుకురిసే వేళ ఆయా ప్రాంతాల్లో ప్రజలకు ఎంతో ఆహ్లాదకర వాతావరణం కనిపించింది. పొగమంచు ముందు సూర్యభగవానుడు చిన్నబోయాడు. –కోవెలకుంట్ల



మంచు ముందు చిన్నబోయిన సూర్యుడు

వ్యవసాయానికి ఈవారం విద్యుత్ వేళలు

కోవెలకుంట్ల: మండలంలోని ఆయా ఫీడర్ల పరిధిలో సోమవారం నుంచి వ్యవసాయ రంగానికి పగటి వేళల్లో తొమ్మిది గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ఆ శాఖ ఏఈ రామమోహన్ తెలిపారు. కోవెలకుంట్ల, కలుగొట్ల, గుళ్లదూర్తి విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని భీమునిపాడు, అమడాల, గుంజలపాడు, జోళదరాశి, రేవనూరు, కలుగొట్ల, పొట్టిపాడు, హరివరం, కొత్తపల్లె, అల్లూరు ఫీడర్లకు సంబంధించి ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని పేర్కొన్నారు.

సంజామలలో..

సంజామల: మండలంలోని సంజామల, ఆకుమల్ల, పేరుసోముల, నొస్సం సబ్‌స్టేషన్‌ల పరిధిలో ఈ వారం వ్యవసాయానికి ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని ఏఈ దుర్గ శ్రీనివాస్ తెలిపారు. ముక్కమల్ల, ఆల్వకొండ, రెడ్డిపల్లె, వసంతాపురం, కమలపూరి, ముదిగేడు, కానాల, అక్కంపల్లె, గిద్దలూరు, ఆర్.లింగందిన్నె, రామిరెడ్డిపల్లె, మిక్కినేనిపల్లె ఫీడర్ల పరిధిలోని గ్రామాల్లో పగటి పూట 9 గంటల విద్యుత్ సరఫరా చేయనున్నట్లు పేర్కొన్నారు.

మొక్కుబడిగా మండల సర్వసభ్య సమావేశం





ఆరోగ్య సేవల గురించి వివరిస్తున్న మెడికల్ ఆఫీసర్, తక్కువ సంఖ్యలో హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారులు

బనగానపల్లె రూరల్: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలోని పొదుపు భవనంలో ఆదివారం జరిగిన మండల సర్వసభ్య సమావేశం మొక్కుబడిగా జరిగింది. ఉదయం 11 గంటలకు ప్రారంభం కావాల్సివుండగా కోరం లేకపోవడంతో సుమారు అరగంట ఆలస్యం అయ్యింది. ఎంపీపీ మానసవీణ అధ్యక్షత వహించారు. రోడ్లు భవనాలశాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి పలు కారణాల దృష్ట్యా హాజరుకాకపోవడంతో అధికారులు తూతూ మంత్రంగా సమావేశాన్ని కొనసాగించారు. కేవలం పలు శాఖల అధికారులు ఆయా శాఖల్లో జరుగుతున్న అభివృద్ధిని సభకు వివరిస్తూ మమ అనిపించారు. కాగా ఆదివారం మండల సర్వసభ్య సమావేశం జరగడంతో పలువురు ఉద్యోగులు అసహనం వ్యక్తం చేశారు. సమావేశానికి తహసీల్దార్‌తో పాటు పలువురు మండలస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకాలేదు. ఎంపీడీఓ వెంకటరమణ, ఉపాధ్యక్షురాలు ఎం.లక్ష్మీదేవి, హౌసింగ్ డీఈ కృష్ణారెడ్డి, పీఆర్ ఏఈ రమణ, ఎంఈఓలు స్వరూప, శ్రీనివాసలు, వెలుగు ఏపీఎం శ్రీనివాసులు, ఎన్ఆర్‌జీఎస్ ఏపీఎం రేష్మా, పలుకూరు, టంగుటూరు మెడికల్ ఆఫీసర్లు మోనిక, శివశంకరుడు, ఏఓ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు,

క్రీడాకారిణులకు క్రీడా దుస్తులు పంపిణీ



రాష్ట్ర బాల్‌బ్యాడ్మింటన్ క్రీడాకారులకు దుస్తులు అందజేస్తున్న రవికళాధర్ రెడ్డి



క్రీడాకారులతో డీఎస్పీ శ్రీనివాసులు

డోన్: పట్టణంలో ఏర్పాటు చేసిన రాష్ట్రస్థాయి బాలికల బాల్‌బ్యాడ్మింటన్ ప్రాక్టీస్ క్యాంపును ఆదివారం డీఎస్పీ శ్రీనివాసులు, కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల డాక్టర్ రవికళాధర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ నెల 28న ముంబయిలో జరగనున్న జాతీయ స్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో మన రాష్ట్రం జట్టు విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కాగా క్యాంపులో పాల్గొన్న క్రీడాకారిణులకు భోజన, వసతి సౌకర్యాలతో పాటు క్రీడా దుస్తులు, బ్యాట్లు, షూస్ సమకూర్చిన డీఎస్పీతో పాటు పోలీసు అధికారులను డాక్టర్ రవికళాధర్ రెడ్డి అభినందించారు. అనంతరం క్రీడాకారిణులతో డీఎస్పీ శ్రీనివాసులు(జాతీయ క్రీడాకారుడు), డాక్టర్ రవికళాధర్ రెడ్డి, కేఈ మౌలా, రషీద్, రామ్మోహన్, రైల్వే ప్రకాశ్, రాంకీ, ఇంతియాజ్ ఫ్రెండ్లీ మ్యాచ్ ఆడారు.

సందడిగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



పాఠశాలలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

ప్యాపిలి: మండల పరిధిలోని హుసేనాపురం ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. 2009–10 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు హాజరయ్యారు. 14 ఏళ్ల తర్వాత కలుసుకోవడంతో ఒకరినొకరు కుశల ప్రశ్నలు వేసుకుంటూ.. పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఆనందంగా గడిపారు. యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు తమకు నేర్పిన విద్యాబుద్ధుల జీవితాంతం గుర్తుంచుకుంటామని తెలిపారు. తమకు ఉజ్వల భవిష్యత్తు ప్రసాదించిన ఉపాధ్యాయులకు రుణపడి ఉంటామన్నారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు పాఠశాలకు రెండు బీరువాలను అందజేశారు. పూర్వ హెచ్ఎం సత్యనారాయణ, ఉపాధ్యాయులు లక్ష్మయ్య, మురళి, నాగజ్యోతి, పద్మావతి, గోపాల్, అంజనప్ప, దివాకర్, మల్లేశ్ తదితరులను ఘనంగా సన్మానించారు.

క్రిస్మస్ వేడుకలకు ముస్తాబు



విద్యుత్ దీపాల అలంకరణలో చర్చి



బేతంచెర్ల సీఎస్ఐ చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

కోవెలకుంట్ల: క్రైస్తవులు అత్యంత పవిత్రంగా జరుపుకునే క్రిస్మస్ వేడుకలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఇప్పటికే నియోజకవర్గంలోని ఆయా గ్రామాల్లో చర్చిలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. కోవెలకుంట్ల– నంద్యాల ఆర్అండ్‌బీ రహదారిలో వెలసిన రోమన్‌కాథలిక్ మిషన్ చర్చిలో(ఆర్‌సీఎం) క్రిస్మస్ పండుగ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనల నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. చర్చి ఆఫ్ సౌత్ ఇండియన్(సీఎస్ఐ) చర్చి, హోసన్న, నూతన యేరుసలేం చర్చిలతోపాటు మండలంలోని గుళ్లదూర్తి, కంపమల్ల, భీమునిపాడు, కలుగొట్ల, రేవనూరు, బిజనవేముల, అమడాల, సౌదరదిన్నె, తదితర చర్చిల్లో బుధవారం అర్ధరాత్రి 2 గంటల నుంచి ప్రార్థనలు ప్రారంభం కానున్నాయి. క్రిస్మస్‌ను పురస్కరించుకుని ఆయా గ్రామాల్లో సందడి వాతావరణం నెలకొంది.

ప్రత్యేక ప్రార్థనలు

బేతంచెర్ల: ఏసు ప్రభువు అనుగ్రహంతో అందరికీ మంచి జరగాలని పాస్టర్ రెవరెండ్ వినోద్ కుమార్ అన్నారు. ఆదివారం రాత్రి పట్టణంలోని ఎరుకలిపేటలో ఉన్న సీఎస్ఐ చర్చిలో మినీ క్రిస్మస్ వేడుకలు, కొవ్వొత్తుల ఆరాధన నిర్వహించారు. కేక్ కట్ చేసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు హెన్రీబాబు, భాస్కర్, జార్జి, ఆనంద్‌రావు, బాల ఏసు, విజయ్ కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా మినీ క్రిస్మస్ వేడుకలు



ఏసు బోధనలను వివరిస్తున్న బందెల రాజు

డోన్ టౌన్: పట్టణంలోని వైఎస్ నగర్‌లో ఉన్న చర్చిలో ఆదివారం మినీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. రెవరెండ్ బందెల రాజు ఏసు జననం, బోధనలను వినిపించారు. క్యాండిల్ లైటింగ్ సర్వీస్ జరుపుకున్నారు. అనంతరం డోన్ మండలంలోని పలువురు పాస్టర్లకు దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బైబిల్ మిషన్ సంఘ సేవకులు మణిరాజ్, యెహోవ, రాజశేఖర్, విశ్వాసరావు, చంద్ర, సుశీలమ్మ, సుజాత, ప్రమీల, జ్యోతి, శైలమ్మ పాల్గొన్నారు.

కారు డ్రైవర్ ఆత్మహత్యాయత్నం

బేతంచెర్ల: అవుకు పట్టణానికి చెందిన కారు డ్రైవర్ బేతంచెర్లలో ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అవుకుకు చెందిన శేఖర్ కుటుంబ సమస్యలతో ఆదివారం ఇంట్లో గొడవపడ్డాడు. మనస్తాపంతో కారులో కర్నూలు వైపు వెళ్తూ మార్గమధ్యలో బేతంచెర్లలోని శేషారెడ్డి సీహెచ్‌సీ ఆవరణలో వాహనాన్ని ఆపి పురుగుల మందు తాగాడు. గమనించిన ఆస్పత్రి సిబ్బంది అతనికి ప్రథమ చికిత్స అందించారు.

స్థలం ఆక్రమించారని ఫిర్యాదు

బేతంచెర్ల: పట్టణంలోని సాయిబాబా ఆలయం ఎదురుగా ఉన్న తమ స్థలాన్ని రామిరెడ్డి, అతని కొడుకు మధు ఆక్రమించి అక్రమంగా షెడ్డు వేసుకున్నారని బాధితుడు షేక్ ఖలీల్ పోలీసులను ఆశ్రయించాడు. ప్రశ్నించిన తనను చంపుతామని బెదిరించారని ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రమేష్ బాబు ఆదివారం తెలిపారు.

కోలుకోలేక యువతి మృతి

అవుకు: ఆత్మహత్యకు యత్నించిన యువతి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందింది. ఎస్ఐ రాజారెడ్డి వివరాల మేరకు.. అవుకు గ్రామానికి చెందిన శిరీష(20) ఏడాది నుంచి టీబీ వ్యాధితో బాధపడుతోంది. ఎందరి వైద్యుల వద్ద చూపించినా నయం కాలేదు. దీంతో జీవితంపై విరక్తి చెంది ఈ నెల 21వ తేదీ నీటిలో పేడరంగు పౌడర్‌ను కలుపుకు తాగింది. వాంతులు చేసుకుంటుండగా ఆమె అన్న నరేంద్ర గమనించి చికిత్స నిమిత్తం అవుకు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందింది. మృతురాలి అన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెల్లడించారు.

హాస్టల్ బాలికల సమస్యలపై దృష్టి సారించాలి

డోన్ టౌన్: వివిధ సంక్షేమ బాలికల వసతి గృహాలతో పాటు గురుకుల పాఠశాలల్లో పనిచేస్తున్న మహిళా వార్డెన్ల భర్తలు వారితో కలిసి అక్కడే నివాసం ఉండడం వల్ల బాలికలు ఇబ్బందులకు గురవుతున్నారని జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యుడు ఏఈ నాగరాజు అన్నారు. ఆదివారం పాతబస్టాండ్ వద్దనున్న ముక్తేశ్వర ఆలయంలో ఆయన మాట్లాడారు. మహిళా వార్డెన్ల కుటుంబ సభ్యులు, వారి భర్తలు వసతి గృహాల్లో ఉండడం వల్ల బాలికలు అసౌకర్యానికి గురవుతున్నారని తెలిపారు. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

మద్యం మత్తులో గర్భిణిపై దాడి

డోన్ టౌన్: పట్టణంలోని కొండపేటలో తాగిన మైకంలో ముగ్గురు వ్యక్తులు ఇంట్లోకి చొరబడి నానా బీభత్సం చేస్తుండగా అడ్డు వచ్చిన గర్భిణీ, ఆమె అత్త లక్ష్మీదేవిపై దాడికి పాల్పడ్డారు. స్థానికుల వివరాల మేరకు.. కొండపేటకు చెందిన సురేంద్ర అదే కాలనీకి చెందిన షేక్షా, భరత్, మధు వద్ద కొంత అప్పు చేశాడు. తిరిగి చెల్లించడంలో జాప్యం చేయడంతో ఆ ముగ్గురు సురేంద్ర ఇంటికి వచ్చి ప్రశ్నించారు. సురేంద్ర లేకపోవడంతో ఇంట్లోని గ్యాస్ సిలిండర్‌ను లాక్కొని అలజడి సృష్టించారు. అడ్డుకున్న భార్య లక్ష్మీదేవి(8 నెలల గర్భిణి), తల్లిపై దాడి చేశారు. అంతలో కాలనీవాసులు వారించగా అక్కడి నుంచి వెళ్లిపోయారు. గాయపడిన ఇద్దరిని డోన్ ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. జరిగిన ఘటనపై సురేంద్ర పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

దివ్యాంగుల సమస్యలను పరిష్కరించాలి

కోవెలకుంట్ల: దివ్యాంగుల డిమాండ్లను నెరవేర్చాలని ఆ సంఘం జిల్లా జేఏసీ నాయకులు నాగరాజు, సుబ్బరాయుడు అన్నారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన కోవెలకుంట్ల మండలం వెలగటూరుకు చెందిన దివ్యాంగ సంఘం జిల్లా అధ్యక్షుడు అందనం దేవరాజును ఆదివారం పరామర్శించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. దివ్యాంగులందరికీ ఇళ్లస్థలాలు కేటాయించి పక్కాగృహాలు కట్టించాలన్నారు. అంత్యోదయ కార్డులు మంజూరు చేయాలని కోరారు. అర్హులైన దివ్యాంగులకు త్రీవీలర్ స్కూటీలు, బ్యాటరీ సైకిళ్లు ఇవ్వాలని పేర్కొన్నారు. బ్యాంకుల ద్వారా దివ్యాంగులకు రూ. 10 లక్షల వరకు రుణాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలపై మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డికి లేఖ రాయనున్నట్లు తెలిపారు. సంఘం నాయకులు నారాయణరెడ్డి, జాకీర్, శ్రీనివాసరెడ్డి తదితరులు ఉన్నారు.



దేవరాజును పరామర్శిస్తున్న దివ్యాంగుల సంఘం జేఏసీ నాయకులు

గుళ్లదూర్తిలో కార్డన్‌సెర్చ్

- రికార్డులు లేని 15 బైక్‌లు సీజ్



రికార్డులు లేని బైక్‌లను సీజ్ చేసిన ఎస్ఐ మల్లికార్జునరెడ్డి

కోవెలకుంట్ల: మండలంలోని గుళ్లదూర్తిలో సీఐ హనుమంతునాయక్ ఆధ్వర్యంలో కోవెలకుంట్ల, రేవనూరు ఎస్ఐలు మల్లికార్జునరెడ్డి, భూపాలుడు ఆదివారం తెల్లవారుజామున కార్డన్ సెర్చ్ నిర్వహించారు. గ్రామంలోని అనుమానితుల ఇళ్లలో సోదాలు చేశారు. ఎలాంటి మారణాయుధాలు లభ్యం కాలేదు. రికార్డులు లేని 15 ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు. అనంతరం గ్రామస్తులను ఉద్దేశించి వారు మాట్లాడుతూ.. ద్విచక్రవాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. హెల్మెట్ లేకుండా బైక్‌లు నడిపితే జరిమానా విధిస్తామని హెచ్చరించారు. ఇటీవల కాలంలో జరుగుతున్న సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనుమానిత వ్యక్తులు గ్రామంలో సంచరిస్తున్నట్లు తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు.



చెత్తచెదారంతో నిండిన రహదారి



పందులకు అవాసంగా మారిన మార్గం

చచ్చినా.. చావే!

- శ్మశాన వాటిక దారి అస్తవ్యస్థం
- మురుగునీరు చేరి వెళ్లలేని పరిస్థితి
- అంత్యక్రియలు నిర్వహించేందుకు తీవ్ర ఇబ్బందులు



దారిలో నిలిచిన మురుగునీరు

కొలిమిగుండ్ల: బతికున్నంత కాలం అసౌకర్యాల మధ్య జీవనం.. చివరకు ఈ లోకాన్ని వీడి శ్మశానానికి వెళ్లాలన్నా కష్టాలు పడాల్సి వస్తోంది. కొలిమిగుండ్ల మండల కేంద్రంలో శ్మశాన వాటికకు చేరుకునే దారి ఈవిధంగా ఉంది. ప్రధాన రహదారి పక్కలోనే బ్రిడ్జి కింద భాగంలో శ్మశానానికి వెళ్లాల్సి ఉంటుంది. ఎవరైనా మృతి చెందితే అంత్యక్రియలు నిర్వహించేందుకు కుటుంబ సభ్యులు,బంధువులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. సంప్రదాయం ప్రకారం చాలా మంది మృతదేహాలను నలుగురు కలిసి చేతుల మీదుగా తీసుకెళుతుంటారు. బ్రిడ్జి వద్ద కిందకు దిగే చోట మొదలు శ్మశానం వరకు దారంతా అస్తవ్యస్థంగా మారింది. మురుగునీరు, చెత్తచెదారం, పిచ్చి మొక్కలు పెరిగి దారుణంగా తయారయ్యాయి. మృతదేహాన్ని తీసుకెళుతున్న క్రమంలో మురుగునీటిలో కింద పడే పరిస్థితులు తలెత్తుతున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలంలో పరిస్థితి దారుణంగా ఉంటుంది. దుర్వాసన, మురుగు నిల్వ చేరడంతో ఇప్పటికే చాలా మంది అంత్యక్రియలు చేసే చోటకు వెళ్లలేకపోతున్నారు. ఇది ఒకలా ఉంటే కర్మకాండల సమయంలో రాత్రి వేళల్లో సమాధుల వద్దకు వెళ్లాల్సిన సమయంలో ప్రజలు పడే బాధలు వర్ణనాతీతంగా మారుతున్నాయి. చివరి మజిలీ ప్రశాంతంగా లేకుండా పోతోందని.. అధికారులు చర్యలు తీసుకుని శ్మశాన వాటిక దారిని బాగు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

గణిత దిగ్గజం శ్రీనివాసరామానుజన్



నెహ్రూనగర్ స్కూల్‌లో గణిత ఉపాధ్యాయులకు సత్కారం



రామానుజన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న విద్యార్థులు

డోన్ టౌన్: భారతదేశం గర్వించదగిన గణిత శాస్త్రవేత్తల్లో శ్రీనివాసరామానుజన్ ఒకరని.. ఆయన ఆవిష్కరించిన అనేక గణిత ఫార్ములాలు అనితర సాధ్యమని నెహ్రూనగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం తొగట సురేష్‌బాబు అన్నారు. రామానుజన్ జయంతిని పురస్కరించుకుని ఆదివారం పాఠశాలలో గణిత దినోత్సవాన్ని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గణిత శాస్త్ర ఉపాధ్యాయులు శివశంకరయ్య, లక్ష్మీనాయక్‌లను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటేశ్వరగౌడ్, వెంకటేశ్వరరెడ్డి, మౌలాలీ, రాంప్రసాద్, సునీత, రత్నమ్మ, జగదీశ్వర్‌నాయక్, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు. అలాగే సామాజిక కార్యకర్త మహ్మద్ రఫీ ఆధ్వర్యంలో కొండపేట బీసీ బాలుర హాస్టల్‌లో వార్డెన్ మధుసూదన్, ట్యూటర్ రామాంజనేయులు నివాళులర్పించారు. ఆయన జీవిత చరిత్రను విద్యార్థులకు వివరించారు.



పాఠశాల ముందు నిల్వ ఉన్న మురుగునీరు

కదలని మురుగు

కొలిమిగుండ్ల: హనుమంతుగుండం ప్రాథమిక పాఠశాల ముందు మురుగునీరు రోజుల తరబడి నిల్వ ఉంటున్నాయి. రోడ్డు పక్కనే ఉండడంతో దుర్వాసన వెదజల్లుతోంది. వర్షాలు కురిసిన సమయంలో పైభాగం నుంచి.. పొలాల్లోంచి నీరు పాఠశాల ముందు నుంచి ప్రవహిస్తుంటాయి. చాలా రోజుల నుంచి నీళ్లు నిల్వ ఉండడంతో మురికిగా మారాయి. గతంలో పాఠశాలకు ప్రధాన మార్గం రోడ్డువైపే ఉండేది. మురుగు సమస్యతో విద్యార్థులు ఇబ్బందులు పడుతుండడంతో గేట్ బంద్ చేసి మరో వైపు దారిని ఏర్పాటు చేశారు. మురుగునీటి వల్ల దోమలు వ్యాప్తి చెందుతున్నాయని గ్రామస్తులు పేర్కొన్నారు. డ్రైనేజీ ఏర్పాటు చేస్తే వర్షాలు కురిసిన నీళ్లు కాల్వలో వెళ్లిపోతాయన్నారు. అధికారులు చర్యలు తీసుకుని డ్రైనేజీ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.